# అమ్మా ! ఆకలి

**శంకరమంచి పార్ధసారధి**

రుక్మిణి ఏడుస్తోంది.

విమల ఊరుకోబెడుతోంది.

రుక్మిణి ఏడుస్తోంది

విమల విసుక్కుంటోంది

రుక్మిణజ ఏడుస్తోంది.

విమల నాలుగు బాదింది

రుక్మిణి ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

నిద్రపోతున్న ఆమె ముఖంలోకి చూస్తూ విమల ఏడుస్తోంది.

☆ ☆ ☆

ఆ సాయంత్రం అన్ని సాయంత్రాల్లాగే వుంది.

ఓ ఖరీదైన హొటల్లో ఈ ఖరీదైన సేట్‌గారి ఒళ్ళో ఓ ఖరీదైన ఆడమనిషి ఖరీదైన విస్కీ తాగుతూ ఒరిగిపోతోంది. అతని భార్య ప్లెజర్ ట్రిప్‌కి, ఆమె భర్త బిజినెస్ ట్రిప్‌కి బొంబే వెళ్ళారు.

ఊరిచివరి పాకలో అమ్మాయి ఇవ్వాళ్ళైనా పాసింజర్లు రాకపోతారా ? అన్నం దొరక్కపోతుందా ? – అని ముఖానికి చౌకపౌడరు రాసుకుంటూ రిక్షావాడి రాకకోసం వీధంతా కలయజూస్తోంది.

మిసెస్ రావ్ అనబడే మీనాక్షి ఎంతకీ భర్తకారు తీసుకురాడేమిటాని అద్దంలో ముఖాన్ని, చేతికున్న రిస్టువాచీని పదే పదే చూసుకుంటోంది. భర్త చేతిలో సంచీ చూశాక అంటించవచ్చునుకుంటూ విమలనబడే ఓ గుమాస్తా పెళ్ళాం పొయ్యికేసి దీనంగా చూస్తోంది.

వాళ్ళందర్కి ఆ సాయంత్రం మామూలుగానే వుంది.

☆ ☆ ☆

" ఎన్నైనా చెప్పు సర్వేశం .... పిల్లల్లేని ఇల్లు ఇల్లే కాదోయ్ ....ఆ విషయంలో నువ్వు రియల్లీ లక్కీ... మా ఇల్లూ వుంది ఎందుకూ ? ఇంటికెళ్ళే సరికి ఇల్లు బావురుమంటూ ఉంటుంది. నా మిసెస్ కెప్పుడూ మహిళాసంఘాలు, సినిమాలు...ఇంటికెళ్ళాలంటే భయంగా వుంటుంది, ఇటీజ్ ఎర్స్ మళ్ళీ బోలెడంత జీతం ...కారు ..మేడ ... ఏం చేసుకోడానికి ..ఆనందం లేకపోయాక – అసూయపడుతున్నా నీ సంగతి చూడు – చక్కగా నల్గురు రత్నాల్లాంటి పిల్లలు ఇంటికెళ్ళేసరికి నీ కోసం ఎదురు చూస్తూ పదికళ్ళు

ఆ మాటలు విన్న సర్వేశానికీ గర్వంగా వుంది లోపల్లోపల.

" మీరలాగే అంటారు సార్. నల్గురు పిల్లల్తో చాలాచాలని జీతంతో ఎంత అవస్థపడుతున్నా ననుకున్నారు. ఇంటికెళ్ళాలంటే భయం ఏటైమ్‌కి ఇంట్లో ఏం నిండుకుంటుందోనన్న భయం. ఒక్కోసారి అనిపిస్తుంది ఐశ్వర్యం ఇవ్వని దేవుడు ఈ పిల్లలెంద్రుకుకిచ్చాడూ అని... "

రావ్‌గారూ సర్వేశాన్ని మాట్లాడనియ్యడం లేదు.

" తాత్కాలికమైన యిబ్బందుల వల్ల ప్రస్తుతం అలాగే అనిపిస్తుంది. వాళ్ళూ పెరిగి పెద్దవాళ్ళై ప్రయోజకులైతే ఈ ఇబ్బందులేంవుండవ్ ...ఇంకేం చెప్పద్దు...ఇంటికెళ్ళిపో – నీకోసం పాపం పిల్లలు వెయిట్ చేస్తుంటారు "

సర్వేశం వీధిమొగలో కారు దిగాడు – రావ్‌గారి కారుదుమ్మురేపుకుంటూ వెళ్లి పోయింది.

" నిజమే – వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళై ప్రయోజకులైతే .....? "

సర్వేశం ఇంటికి చేరాడు. ఆలోచనలు ఆగిపోయాయి.

"ఏం అలా వున్నావ్ ? " భార్యను ఆప్యాయంగా అడిగాడు.

విమల ఏం మాటాడలేదు.

" చెప్పు విమలా " బుజ్జగిస్తున్నట్టడిగాడు.

" బియ్యం అయిపోయాయని .....

" అవునవువ. పొద్దున్న చెప్పావ్ ఆఫీసు గొడవల్లో మర్చిపోయాను.

సంచీ తీసుకురా – తెస్తాను "

సంచి తీసుకుని రోడ్డెక్కాడు. అతని ఆలోచనలు విమలమీదకు మళ్ళాయి.

" ఉన్నదాంటోనే పరమాన్నం లేకపోయినా – భర్తకు, పిల్లల్కి కడుపు నిండా అమర్చిపెట్టాలనేతత్వం ఆమెది. తనకోసమంటూ ఏమీ అడగదు. తను తెచ్చే చాలని జీతంతో కాలక్షేపం చేస్తుంది. ఎంత జాగ్రత్తగా వున్నా తనకోచ్చే జీతం సరిపోదు.

ఆఖరివారంలో ఏభయ్యో, అరవయ్యో అప్పుచెయ్యక తప్పదు. నెల మొదటి అప్పుతీర్చేస్తే మళ్ళీ తరుగు– ఎన్నిసంవత్సరాలైనా యింతే – గొఱ్ఱెతోక జీతం – గొంగళి పురుగు జీవితం.

సర్వేశం సరాసరి రావ్ గారింటికెళ్ళాడు. కాఫీలు తాగాక.

" ఏమిటిలావచ్చావ్ ? " అన్నారు రావ్ గారు.

" ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. తమరో ముప్పైసర్దితే – ఫస్ట్ రాగానే ఇచ్చేస్తాను "

" దానికేముంది – తీసికెళ్లు " అని రావ్ గారు లోపలికెళ్ళారు.

పిల్లలు ఆకలాకలని ఏడుస్తున్నారు. ఐదేళ్ళ రుక్మిణి మరీను. కాస్త ఆలస్యమైతే ఆకలికి తట్టుకోలేదు. విమల సముదాయించింది. బుజ్జగించింది. భర్త వస్తాడేమోనని రెండు మూడుసార్లు వీధి లోకి చూసింది. అతని జాడ ఎక్కడా కనిపించలేదు.

రుక్మిణి ఏడుపుతో సతాయించేస్తోంది. చివరికి విసుగెత్తి నాల్గు బాదింది. ఏడ్చి ఏడ్చి రుక్మిణి నిద్రోదయింది. నిద్రపోతున్న కూతుర్ని చూస్తే విమలక్కూడా ఏడుపొచ్చింది. పిలల్లకి అన్నం పెట్టలేని తన బలహీనత ఆమెను వెక్కిరించింది.

భర్తను చూసి చటుక్కున లేచి నిలబడింది విమల.

" ఇంత ఆలస్యమై పోయిందేమిటండి. – పిల్లలు ఆకలాకలని ఏడ్చి పడుకున్నారు " బాధపడింది విమల.

" మా ఆఫీసర్ రావు గారింటికి అప్పుకోసం వెళ్ళాను . ఆయన ఏదో కబుర్లు చెప్తూ అక్కడే కూర్చోబెట్టేసారు – అన్నట్టు రుక్మిణి నిద్రపోయిందా ? "

రుక్మిణి గురించే భర్త ఎందుకడిగాడో ఆమె కర్దంకాలేదు . ఆ విషయమై ఆమె అంతగా పట్టించుకోలేదు.

" ఆకలిని సతాయించింది. రెండు కొట్టాను "

ఆ మాటలువిని సర్వేశం తల్లడిల్లిపోయాడు నిద్రపోతున్న రుక్మిణి దగ్గర కెళ్ళి కూర్చున్నాడు. చటుక్కున ఆమెను ముద్దుపెట్టుకున్నాడు.

విమల అన్నం వండి పిల్లల్ని పెట్టింది. రుక్మిణి నిద్దట్లో జోగుతూనే అన్నం తింటోంది.

సర్వేశం అక్కడే కూర్చుని అన్నం పెట్టే భార్యవంక తినే పిల్లలవంక తదేకంగా చూస్తున్నాడు.

" రుక్కూ ! నువ్వు రోజూ పూలు కోసుకోడానకి వెడతావ్ – రామారావు మామయ్యగారు – వాళ్ళింటికెడతావా అమ్మా ! "

బుజ్జగిస్తూ అడిగాడు సర్వేశం....

రుక్మిణి ఇష్టమున్నట్టు తలూపింది.

సర్వేశం అలా ఎందుకడిగాడో విమల కర్ధం కాలేదు.

పిల్లలు నిద్రపోయాక సర్వేశం. విమల భోజనాలకు్కూర్చున్నారు.

" మా ఆఫీసర్ రామారావ్‌గారు రుక్కుని పెంచుకుంటానంటున్నారు "

విమల నోట్ల పెట్టుకోబోతున్న ముద్ద జారి ఆమె కంచంలో పడిపోయింది.

సర్వేశం ఇప్పుడు చెప్పిన విషయానికి, ఇందాకటి మాటలకి ఆమె ఏదో సంబంధాన్ని వెతికే ప్రయత్నంలో
ఉండిపోయింది.

ఒక్కోసారి ఎదుటివారి మౌనం మనకి భయంకరంగా వుంటుంది. మన మాటని అవతలివాడు ' ఛీ కాదు – ' అని తోసిపుచ్చినా ఫరవాలేదు కానీ అవతలివాడి మౌనాన్ని మనం భరించలేం.

సర్వేశం అలాంటి పరిస్థితిలోనే వున్నాడు.

" మనం ఓ పూట మాడేనా పిల్లల్కి పెడదాం – అంతేకాని పిల్లని పెంపు ఇవ్వడమేమిటి అనాధ పిల్లల్లాగ " ఎంత అణుచుకుందామన్నా విమల మాటల్లో ఉక్రోషం వినిపించింది.

" ఆవేశపడకు విమలా – తీరికగా ఆలోచించు. నాకొచ్చే చాలీచాలని జీతంతో వాళ్ళకి మనమేం చూడగల్గుతున్నాం . వీళ్ళు పెరిగి, పెద్ద వాళ్ళై చదువులు పెళ్ళిళ్ళు అయ్యేసరికి .....ఈ అప్పుల భారంలో – కంటికి నిద్రలేక, మనస్సుకి శాంతిలేక – గానుగెద్దుల్లా బతికి బతికి మనం మిగుల్తామంటావా ?

రావుగారంటావా ఆస్థిపాస్థులున్న వాడు తనంతటతానే " పిల్లను పెంపియ్యమని అడిగాడు. అదొక్కటే నాకు భారమని కాదు. కనీసం దాని భావి జీవితమైనా సుఖంగా వుంటుందని ఆశ పైగా అదేం దూరం వెళ్ళిపోదుకదా – పక్కవీధిలోనే ఉంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడే వెళ్ళి చూసి రావచ్చు "

మధ్యలోనే అందుకుంది విమల

" మీరెన్నైనా చెప్పండి – నాకు మాత్రం ఇష్టంలేదు.

" పిచ్చి విమలా – నీకోణంలోంచే ఆలోచిస్తున్నావ్ తప్ప.... రుక్మిణికి బంగారు భవిష్యత్తుందన్న విషయం మర్చిపోతున్నావ్ – అయినా తొందరేం లేదు – నిదానంగా ఆలోచిద్దాం. "

మరో మూడురోజులపాటు తర్జన భర్జనలయ్యాయి

ఆ విషయం ప్రస్తావనకి వచ్చినప్పుడల్లా విమలకి ఎవరో తల్లిపేగు తెంపుతున్నట్టనిపించింది.

అంతమాత్రంచేత సర్వేశానికి  బాధలేదని కాదు – అతనికి  ఓ మూల ఏదో  నరం కదుల్తూనే వుంది. కానీ " నేను ఇవ్వలేని బంగారు భవిష్యత్తు దానికోసం వెతుక్కుంటూ వస్తుంటే – మోకాలడ్డటం  వివేకం కాదు " అన్న ఆలోచన అతని చేత ముందడుగు వేయిస్తోంది.

చివరికి తను ఎప్పుడూ కావాలనుకుంటే అప్పుడల్లా వెళ్ళిరుక్మిణిని చూసుకుని వచ్చే షరతుమీద  విమల – రుక్మిణిని పెంపు ఇవ్వడానికి  ఒప్పుకుంది.

సర్వేశం చెప్పిన విషయం రావ్ గార్కి చాలా ఆనందం  కలిగించింది. ఎప్పుడూ బావురమంటూ వుండే తనిల్లు  ఇహ ముందు  కలకల్లాడుతుందన్న ఊహే ఆయనకి గొప్ప రిలీఫ్‌గా వుంది.

☆ ☆ ☆

అనుకున్న రోజు రానే వచ్చింది.

విమల ఆరోజు ఉదయమే రుక్మిణికి తలంటుపోసింది సర్వేశం కొన్న కొత్త గౌను తొడిగింది. పరమాన్నం చేసి ఆమెకు కడుపునిండా పెట్టింది.

ఆరోజు లేచినప్పట్నించి విమల తన ఒంట్లో రక్తం ఎవరో తోడుతున్నట్టు ఫీలవుతోంది. అటుతిరిగి ఇటుతిరిగి కన్నీళ్ళు తుడచుకుంటోంది. లోపల బాధతో కుమిలిపోతున్నా పైకి మాత్రం  చాలా గంభీరంగా కనిపించడాన్కి ప్రయత్నిస్తున్నాడు సర్వేశం. ఎక్కడికో  కొత్త ప్రదేశాన్కి  కొత్త మనుషుల్లోకి  వెళ్ళి  పోతున్నానన్న భావన రుక్మిణిని థ్రిల్లింగ్‌గా వుంచుతోంది.

రావుగారి కారు రావడం ఆలస్యం. రుక్మిణివెళ్ళి ఆయనకారులో  కూర్చుంది.

" మరేం గాభరా పడకండి – ఎప్పుడు కావాలంటే అప్పుడువచ్చి మీరు మీ పాపని చూడొచ్చు – మధ్యలో ఆమెను తెచ్చుకుని  మీ ఇంట్లో నాల్గురోజులు అట్టే పెట్టుకున్నా నాకభ్యంతరం లేదు. "

రావగారన్న మాటలువిని విమల భోరున ఏడ్చింది.

" మీ పాపకి మా ఇంట్లో ఏంలోటు జరగదమ్మా – మీరలా భాదపడొద్దు " రావుగారు విమలని సముదాయిస్తున్నారు.

" అబ్బే అదేంమాట ....కానీ  కన్న కడుపు. "

సర్వేశం గొంతులోంచి మాట బయటికి రావడంలేదు "

" ఆఫ్‌కోర్స్  – అదీ నిజమే –" రావ్ గారు సర్వేశం భుజంమీద చెయ్యేస్తూ అన్నారు.

కారులో  కూర్చున్న రుక్మిణికిదేం అర్థంకాలేదు.

తనను మావయ్యగారింటికి వెళ్ళమన్న తల్లిదండ్రులే  ఎందుకేడుస్తున్నారో ఆమెకు తెలియలేదు.

కారు వీధి మలుపు తిరిగింది.

విమల నోట్లో పమిటకొంగు కుక్కుకుంటూ లోపలికెళ్ళిపోయింది.

సర్వేశం కన్నీళ్లు తుడుచుకున్న చేతులు స్థంభంకేసి పాముకున్నాడు.

☆ ☆ ☆

రుక్మిణికి రావ్‌గారింట్లో మొదటిరోజు కొత్త కొత్తగా గడిచిపోయింది. ఆ ఇంట్లో ఇద్దరు పనిమనుషులులన్నారు ఒకామె వంట వగైరా ఇంటిపనులు చూడటానికి  ఒకామె ప్రత్యేకంగా రుక్మిణిని  చూసుకోడానికి.

రుక్మిణి రాకవల్ల తన దినచర్య ఏమాత్రం  మారని మీనాక్షనబడే మిసెస్ రావ్ ఆ రోజు కూడా  యాధాతథంగా  మహిళా  సంఘానికి, ఓ చిన్న  సైజు  పార్టీకి – ఫస్టు షో సినిమాకి వెళ్ళి వచ్చింది.

రావ్‌గారు మాత్రం శెలవుపెట్టి ఆ రోజంతా రుక్మిణితోనే గడిపారు. ఆమెను బజారు తీసుకెళ్ళి స్వీట్సు, బిస్కెట్సు, గౌనులు – ఆటవస్తువులు కొన్నార. రుక్మిణికి సరదాగా, హాయిగా – థ్రిల్లింగ్‌గా వుంది.

ఆ రాత్రి ఆమె రావ్‌గారి దగ్గరే నిద్రపోయింది. తనని ప్రపంచం  చివరకి తీసికెళ్ళి ఓ మైదానంలో  ఒంటరిగా  ఒదిలేసినట్టు కలొచ్చి – రుక్మిణి నిద్దట్లో కెవ్వున అరిచింది.

రావ్‌గారు ఆమెను జో కొట్టారు.

సరిగ్గా అదే టైముకి తన బిడ్డని ఎవడో భయంకరమైన  రాక్షసుడు భుజాన్న వేసుకుని తీసుకుపోతూ వుంటే ఆమె తనకోసం చేతుల చాచి ఏడుస్తున్నట్టు విమలకి కలొచ్చి ‘ ఒదలండి ’అని గట్టిగా  అరిచింది.

పక్కనే పడుకున్న  సర్వేశం ఆమె మీద చెయ్యివేసి

“ ఏం లేదు పడుకో ” అన్నాడు.

అంతవరకూ నిద్రపట్టని సర్వేశం కూడా రుక్మిణి గురించే ఆలోచిస్తున్నాడు.

మర్నాడుదయం “ ఇంటికెళ్ళిపోతా ” అంది రుక్మిణి బిక్కమొగంతో–

సాయంత్రం  మీఅమ్మనినాన్నని  తీసుకొస్తాలే ” అని రావ్‌గారు సర్దిచెప్పి ఆఫీసు కెళ్ళిపోయారు.

తర్వాత రుక్మిణికేం తోచడంలేదు. అంతపెద్ద గదిలో ఒంటరిగా తను ఒక్కతే ఓ మనిషి. రుక్మిణికి చిరాగ్గా అనిపించింది.

ఆడుకుందామంటే చిట్టిలేదు –చిన్ని లేదు. బువ్వాలాటాడుకోడానికి చింత కాయలు్లేవు, ఉప్పులేదు – కందిపప్పులేదు. తనను ముద్దు చేసే తల్లి లేదు.

బిస్కట్లు తినడానికి చిరాకెత్తిపోయింది. ఆమె తప్పితే ఆ ఇంట్లో మరి చిన్నపిల్లల్లేరు. అమ్మా నాన్న తనని అక్కడికి ఎందుకు పంపేరు. ఒక్కసారిగా రుక్మిణికి ఏడుపొచ్చింది.

గట్టిగా ఏడ్వటం మొదలెట్టింది. గంటైన ఊరుకోపెట్టడం పనిమనిషి వల్ల కాలేదు.

" ఛీ వెధవ వసంత – ఇదొక్కత్తి తక్కువైంది మా ప్రాణానికి " మిసెస్ రావ్ విసుక్కున్నారు.

అది విన్న పనిమనిషి " నీకు బగవంతుడు పిల్లల్నియ్యకపోవడమే మంచిదైంది. " అనుకుంది.

ఫోన్‌లో విషయం విన్న రావ్‌గారు సర్వేశాన్ని తీసుకుని ఇంటికెళ్ళారు. ఇద్దరుకల్సి ఆ సాయంత్రం ' అమ్మను ' తీసుకొస్తామని చెప్పి రుక్మిణిని ఊరుకోబెట్టారు.

" సాయంత్రం నా భార్యను తీసుకొస్తాన్సార్ " అన్నాడు సర్వేవం . " ఈ వేళ ఒద్దు – ఆవిడవస్తే కూడా వచ్చేస్తానంటుంది రుక్మిణి. నాల్గురోజులు ఇక్కడ అలవాటు కానివ్వండి.

సరేనన్నాడు సర్వేశం.

" రుక్మిణిని చూసొచ్చారా ? ఎలా వుంది ? " భర్త ఇంటికి రాగానే విమల అడిగింది.

" ఓ బ్రహ్మాండంగా వుంది. అస్సలు ఇంటికి వస్తానని అనడమేలేదు. ఎంత ఆనందంతో ఆడుకుంటోందనుకున్నావ్.

భర్తమాటలకి విమల కాస్త నొచ్చుకుంది.

అవును గదిలోకెళ్ళి కన్నీళ్ళు తుడచుకోవడం ఆమె చూళ్ళేదు.

" ఏమండి ఒకసారి వెళ్ళి చూసొద్దామ్మా ? " అంది ఆత్రంగా.

" పిచ్చి విమలా – ఇప్పట్నుంచీ రోజూ వెడితే బాగుండదు. రెండు రోజులు పోయాక వెడదాం.

ఆమె ఇంకేమనలేదు.

అలా అబద్దం ఆడాల్సి వచ్చినందుకు సర్వేశం బాధపడ్డాడు. అతను అన్ని బాధల్ని " పిల్ల సుఖపడుతుంది " అన్న ఆశకింద తొక్కేస్తున్నాడు.

మర్నాడు మధ్యాహ్నం అన్నం తింటున్న విమల వంటింటి గుమ్మం దగ్గర అలికిడైతే చూసింది.

గుమ్మాన్ని ఆనుకుని పరాయింటి దగ్గర నుంచున్నట్టు నుంచున్న రుక్మిణి ఆమెను చూసేసరికి విమలకి ఆనందంతో గుండెలు పొంగాయి. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి....తల్లి పేగు కదిలినట్టనిపించింది.

" రుక్కూ ! ఇలా నా దగ్గరకి రాతల్లి ! " ఆప్యాయంగా పిల్చింది.

రుక్మిణి లోపలికి రాలేదు.

" ఏమ్మా – వాళ్ళు తిట్టారా ? " లేదన్నట్టు తలూపింది.

" కొట్టారా నిన్ను ? " మళ్ళీ అదే సమాధానం.

" వాళ్ళతో చెప్పే వచ్చావా ? " – తల అడ్డంగా ఊపింది.

విమల చెయ్యైనా కడుక్కోకుండా లేచి వెళ్ళి రుక్మిణిని ఎత్తుకుంది. ఆమె వెంటనే ఏడుపు ప్రారంభించింది.

" ఏమైంది తల్లీ – ఏడుస్తున్నావ్ – " విమలకి కళ్ళనీళ్ళు తిరుగుతున్నాయి.

రుక్మిణి తల్లి గుండెలకు హత్తుకుపోతూ ఆమె మెడచుట్టూ చేతులేసి అంది.

" ఈసారి ఆకలేసినా అన్నం పెట్టమని అడగను – నన్నిక్కడ ఉండనిస్తావా అమ్మా " విమలకి గొంతు పూడిపోయింది.

------- **అయ్యిపోయింది** -------

**( కీ.శే. పమ్మి వీరభద్రరావుకి కృతజ్ఞతలతో )**